క్లుప్తంగా

ఆడపిల్లల చదువు సమాజానికి వెలుగు



శాయంపేట : ఆడపిల్లలను చదివిస్తే సమాజానికి వెలుగునిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ఉమెన్ మాబ్ మానస అన్నారు. మండలంలోని కొత్తగట్టుసింగారంలో గురువారం బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం నిర్వహించి చిన్నారులకు బారసాల నిర్వహించారు. అనంతరం తల్లిబిడ్డకు నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మధుర, రేవతి, సరిత, తల్లు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రాధాన్యం లేనందునే పార్టీ మారుతున్నా'

దామెర : పార్టీ కోసం కష్టపడి పనిచేసినా తగిన ప్రాధాన్యం లేనందునే బీఆర్‌ఎస్ పార్టీని వీడుతున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రధాన అనుచరుడు, బిల్లా రమణారెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వకుండా ప్రాధాన్యతలేని రైతుబంధు పదవీ ఇచ్చి చల్లా ధర్మారెడ్డి చేతులు దులుపుకొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసే సమావేశంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిపారు. తనతో పాటు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో కార్యకర్తలు చేరనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

శాయంపేట : రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బహుజన సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురిసిన వడగళ్ల వానకు చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. అకాల వర్షంతో వరి, మొక్కజొన్న పంటలు ఎక్కువ మొత్తంలో దెబ్బతిన్నాయని, ప్రభుత్వం తక్షణమే నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయశాఖ అధికారుల ద్వారా సర్వేలు చేపట్టి నష్టపోయిన రైతుల సమాచారం తీసుకొని వారికి పరిహారం ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు వేశారు.. డ్రెయినేజీ మరిచారు

- మూడేళ్లు గడుస్తున్నా మోక్షంలేదు
- గేట్‌వాల్వ్‌లోకి ప్రవేశిస్తున్న మురుగునీరు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

శాయంపేట : 'కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఓడిపోయినట్లు' అనే సామెతను తావిస్తోంది అధికారుల పనితీరు. పట్టణాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు పలు అభివృద్ధి పనులను శ్రీకారం చుడుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం నీరుగారుతోంది. మండల కేంద్రం నుంచి ఆత్మకూరు వెళ్లే రోడ్డు వెడల్పులో భాగంగా గత మూడేళ్ల క్రితం శాయంపేట సెంటర్ నుంచి గ్రామ శివారు వరకు ఉన్న సైడ్ డ్రేయినేజీని అధికారులు పూర్తిగా తొలగించారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి అయ్యి మూడేళ్లు గడుస్తున్నా డ్రెయినేజీ నిర్మాణాన్ని మరిచిపోయారు. గతంతో ఉన్న సైడ్‌డ్రెయినేజీని తొలగించిన అధికారులు మళ్లీ నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తేలికపాటి వర్షానికి వర్షపు నీరు ఇళ్లలోకి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.

గేట్‌వాల్వ్‌లోకి ప్రవహిస్తున్న మురుగునీరు

తాగునీటి నల్లాల గేట్‌వాల్వ్ రోడ్డు పక్కన ఉండడంతో మురుగునీరు అందులోకి ప్రవహిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి కురిసిన తేలికపాటి వర్షానికి మురుగు నీరు గేట్‌వాల్వ్‌లోకి, ఇళ్లలోకి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవచూపి సైడ్ డ్రెయినేజీని నిర్మించాలని కోరుతున్నారు.



తేలికపాటి వర్షానికి ఇళ్లలోకి చేరిన వర్షపునీరు(ఫైల్)



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు (ఫైల్)



గేట్‌వాల్వ్‌లోకి వెళ్తున్న మురుగునీరు

పాత డ్రెయినేజీని కూల్చారు

గతంతో నిర్మించిన డ్రెయినేజీని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మూడేళ్ల క్రితం తొలగించారు. రోడ్డు పనులు పూర్తి అయ్యాక మళ్లీ నిర్మిస్తామని అధికారులు అన్నారు. కానీ ఇప్పటి వరకు నిర్మించలేదు. వర్షం వస్తే మురుగునీరు ఇళ్లలోకి వస్తుంది. వరద నీరుతో ఇళ్లు కూలిపోయే స్థితికి వచ్చాయి. గేట్‌వాల్వ్‌లోకి మురుగునీరు వెళ్తోంది. నల్లా నీళ్లు తాగాలన్నా, ఇతర అవసరాలకు ఉపయోగించాలన్నా భయమేస్తుంది. అధికారులు, పాలకులు ఇప్పటికైనా చొరవచూపి డ్రెయినేజీని నిర్మించాలి.

– కురాకుల కుమారస్వామి

సంక్షిప్తంగా

మహిళలకు అండగా సఖి కేంద్రం

కమలాపూర్ /ధర్మసాగర్ : ఆపదలో ఉన్న మహిళకు సఖి కేంద్రం అండగా నిలుస్తోందని సఖి వన్‌స్టాప్ కేస్‌వర్కర్ వినీల, హరిత అన్నారు. కమలాపూర్ మండలంలోని గూనిపర్తిలో, ధర్మసాగర్‌లోని దేవునూరులో వేర్వేరుగా సఖి వన్‌స్టాప్ కేంద్రం హనుమకొండ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. విడిపోయే భార్యాభర్తలను ఒకటిచేయడం, వరకట్న, లైంగిక వేధింపులు, భ్రూణ హత్యలు, ఇతర వేధింపుల కారణంగా మానసికంగా కృంగిపోయే మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడం కోసం సఖి పని చేస్తోందన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

ఎల్కతుర్తి : వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లిన వద్ధురాలు ప్రమావశాత్తు బావిలోపడి మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని జగన్నాథపూర్‌లో గగురువారం చోటుచేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగన్నాథపూర్ గ్రామానికి చెందిన పంజాల ఎల్లమ్మ (65) ఈనెల 7న వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా కనపించలేదు. బంధువులను సంప్రదించినా ఆచూకి తెలియలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బావిలో చూడగా ఎల్లమ్మ నీటిలో తేలుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్‌లు మృతదేహాన్ని బావిలోనుంచి తీసి పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంజీఎం మార్చురీకి తరలింపు

కమలాపూర్ : మండలంలోని దేశరాజుపల్లి–ఉప్పల్ గ్రామాల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది కుళ్లిన మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. కాగా గురువారం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. మృతుడికి తెల్ల గడ్డం, తెల్ల వెంట్రుకలు ఉన్నాయని, మృతదేహం పక్కన గులాబీ రంగు చెప్పులు (ఆడవారు ధరించేవి), నీలి రంగు షర్టు, నీలి, తెలుపు రంగు గీతలు గల టవల్ ఉన్నాయన్నారు. మృతుడికి సంబంధించిన బంధువులు, ఆచూకీ తెలిసిన వారు కమలాపూర్ పోలీసులను 8712685125, 8712685249, 8712685014 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కారు, బైక్ ఢీ

ధర్మసాగర్ : కారు, బైక్ ఢీ కొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సాయిపేట గ్రామానికి చెందిన సోంపెల్లి శేషగిరిరావు ద్విచక్రవాహనంపై ఓఆర్‌ఆర్ బ్రిడ్జి మీద నుంచి ఉనికిచర్ల సర్వీస్ రోడ్డు గుండా ధర్మసాగర్ వైపు వస్తున్నాడు. బ్రిడ్జి క్రింద నుంచి వడ్డేపల్లి రోడ్డు వైపు ఓ కారు వెళ్తుంది. ఈ క్రమంలో కారు, బైక్ ఢీ కొనగా బైక్‌పై వెళ్తున్న శేషగిరిరావుకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108లో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

చెలరేగిన మంటలు

శాయంపేట : మైలారం గ్రామ శివారులో సుధాకర్‌రెడ్డికి చెందిన మొక్కజొన్న క్షేత్రంలో విద్యుత్ షాట్‌సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగాయి. 10 ఎకరాల్లోఉన్న మొక్కజొన్నచొప్పకు నిప్పంటుకుంది. ఎస్సై ప్రమోద్‌కుమార్, కానిస్టేబుల్ సాధన్, తోటి రైతులతో కలిసి మంటలను ఆర్పివేశారు.

వినతిపత్రం అందజేత

శాయంపేట : తాళ్లకుంట చెరువు వద్ద ఉన్న చేతిపంపును రిపేరు చేయాలని దళిత సంఘం నాయకుడు సుధాకర్ గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

ఆరునెలల్లో సాగునీరు తీసుకొస్తా

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు : రానున్న ఆరునెలల్లో మండలానికి సాగునీరు తీసుకువచ్చి మండలాన్ని సస్యశ్యామలం చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం పీచర, వేలేరులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అత్యంత అవినీతి కుటుంబం కల్వకుట్ల కుటుంబమని విమర్శించారు. ధరణి పేరిట వందలాది ఎకరాల భూమి ఆక్రమించారని, లిక్కర్ దందా చేసి కవిత కోట్లాది రూపాయలు సంపాదించిందని ఆరోపించారు. ఘన్‌పూర్ ప్రజలకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే కాంగ్రెస్ నాయకులు రానియలేదని, రాజయ్య దళితబంధు పేరుతో పేద దళితుల దగ్గర కొట్లాది రూపాయలు వసూలు చేశాడని, వాటి ఆధారాలు తన వద్ద ఉన్నాయని అన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తనను విమర్శించే స్థాయి లేదని ఎద్దేవా చేశారు. గతంలో ప్రారంభించిన రూ.104 కోట్ల పైప్‌లైన్ పనుల్లో కాంట్రాక్టర్ వద్ద రాజేశ్వర్‌రెడ్డి రూ. 6 శాతం కమీషన్లు తీసుకున్నాడని ఆరోపించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి అవినీతి చేసినట్లు నిరూపిస్తానని అన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ వర్ధన్నపేటలో పేదప్రజల భూములను ల్యాండ్ పూలింగ్ పేరిట వందల ఎకరాలను కబ్జా చేశాడని ఆరోపించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తివేయడం ఖాయమని అన్నారు. అనంతరం పీచర మాజీ సర్పంచ్ మ్యాక రవీందర్, అనుచరులు, వేలేరు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు.



వేలేరు : మాట్లాడుతున్న శ్రీహరి

శాయంపేట : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కొప్పుల, గంగిరేణిగూడెం, కాట్రపల్లి, ప్రగతిసింగారం, పత్తిపాక, మాందారిపేట, గట్లకానిపర్తి గ్రామాల్లో గురువారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీలో పలువురు చేరగా ఆహ్వానించారు.

దామెర : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బూత్‌స్థాయి నాయకులు ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టుపెట్టి ప్రచారం నిర్వహించారు. మండల ప్రధానకార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి ప్రచారం చేపట్టారు.

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి, ముప్పారం, ధర్మసాగర్‌లో ఎమ్మెల్యే శ్రీహరి కార్నర్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి కావ్యను గెలిపించాలని కోరారు.

దళితులకు ద్రోహం చేసిన కడియం శ్రీహరి

ధర్మసాగర్ / నడికూడ: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దళితులకు ద్రోహం చేశాడని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ ఆరోపించారు. ధర్మసాగర్, పెద్దపెండ్యాలతో పాటు నడికూడ మండల కేంద్రంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో కడియం శ్రీహరి కుట్రలు చేసి దళితులందరినీ పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేసి చివరకు ఆయన కూడా కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరాడని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం ఆశపడిన దళితులను మోసం చేసి బిడ్డకు ఎంపీ టికెట్ తెచ్చుకున్నాడని విమర్శించారు. అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న దళిత బిడ్డలు ఈ విషయంపై చర్చించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. గడిచిన 30 ఏళ్ల నియోజకవర్గంలో దళితుల రిజర్వేషన్‌ను కడియం శ్రీహరి కబ్జాచేశాడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు బిడ్డ కోసం దళితులను మోసం చేసేందుకు కడియం వస్తున్నాడని, తస్మాత్ జాగ్రత్తగా అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. మూడోసారీ మోదీ ప్రధాని కావాలంటే దళిత బిడ్డనైనా తనను గెలిపించాలని కోరారు. ఎంపీగా గెలిపిస్తే ధర్మసాగర్ మండల కేంద్రంలో కాల్వ పనులు చేపట్టి నక్కల తూము ద్వారా సాగు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, విజయరావు, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, యుగేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధర్మసాగర్ : మాట్లాడుతున్న అరూరి రమేశ్

పరకాలలో..

పరకాల : పార్లమెంట్ ఎన్నికల తర్వాత పరకాలలో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు చందుపట్ల రమణారెడ్డితో పాటు ఆయన సోదరుడు, పరకాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, సూర్యదేవరసదానందం గురువారం బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, నాయకులు దగ్గు విజేందర్‌రావు పాల్గొన్నారు.